హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎ.రజాక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి తెలుగు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. – బోధన్, ఏప్రిల్ 2

బ్రోచర్ల ఆవిష్కరణ

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టీయూ వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 : టీయూ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జూలై 17, 18వ తేదీల్లో 'ఎంపవరింగ్ ఇండియా –2047 స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అధ్యాపకులు తెలిపారు. ఇందుకు సంబంధించి బ్రోచర్లను టీయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాలపై ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

బాబూ జగ్జీవన్ రావు జయంతిని పురస్కరించుకొని టీయూలో ఈనెల 5న 'భారత సమ్మిళిత వృద్ధి' అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వారు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాలతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

కంఠేశ్వర్, ఏప్రిల్ 2 : ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్రప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ గడువు మార్చి 31తో ముగియగా, ఈనెల 30 వరకు పొడిగించినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30లోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్ని మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన కళాకారుడు ఇందూరి బలవీర్ బాలకృష్ణ చిత్రకళా పురస్కారం అందుకున్నారు. వివిధ సాంస్కృతిక కళారంగాల్లో అందిస్తున్న విశిష్టసేవలకు హైదరాబాద్‌లో మానసా ఆర్ట్స్ థియేటర్స్, త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో బుధవారం పురస్కారాలు ప్రదానం చేశారు. బలవీర్ బాలకృష్ణ పురస్కారం అందుకోగా.. అధికారులు, స్థానికులు ఆయనను అభినందించారు.

– వర్ని, ఏప్రిల్ 2

ఇందల్వాయి పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారిగా పని చేస్తున్న ఎనుగందుల శంకర్ మంగళశారం ఉగాది కవి పురస్కారం అందుకున్నారు. నిజామాబాద్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో డీఈవో అశోక్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

– ఇందల్వాయి, ఏప్రిల్ 2

పోలీసులపై టిప్పర్ యజమాని దాడి

- **కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు**

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 : అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై టిప్పర్ యజమాని దాడిచేశాడు. సీఐ మల్లేశ్, ఎస్సై సత్యం తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం (బీ) వద్ద పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు మొరం టిప్పర్ డ్రైవర్‌ను వే బిల్లు చూపాలని అడిగారు. దీంతో టిప్పర్ డ్రైవర్ అదే గ్రామానికి చెందిన యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో టిప్పర్ యజమాని వచ్చి, పోలీసులతో వాగ్వాదానికి దిగి, దాడి చేశాడు. పోలీసులు పైస్థాయి అధికారుల ఆదేశాల మేరకు టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన నవీన్ అలియాస్ బాబితోపాటు డ్రైవర్ నగేశ్‌పై కేసు నమోదు చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు.

9 వరకే సాగునీటి విడుదల

మోర్తాడ్, మార్చి 2: తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించిన సాగునీటి ప్రణాళిక ప్రకారం కాకతీయ ప్రధానకాలువ, సరస్వతీకాలువ, లక్ష్మీకాలువ, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలకు, సూక్ష్మనీటిపారుదల పథకాల ఆయకట్టుకు ఈనెల 9 ఉదయం 6గంటల వరకు మాత్రమే సాగునీటిని విడుదల చేస్తామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాసరావుగుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరితడి అని, అన్ని కాలువల పరిధిలోని రైతులు గమనించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తరువాత ప్రాజెక్ట్‌లో మిగిలే నీటిని నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల తాగునీటి కోసం వినియోగించుకునే విధంగా సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేయండి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 2: బోధన్ మున్సిపల్ పరిధిలో వివిధ సమస్యల పరిష్కారానికి అధికారులను నియమించినట్లు బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర సమస్యలుంటే అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్–77940 28429, తాగునీటి సరఫరాకు మున్సిపల్ ఇంజినీర్ యోగేశ్– 96426 25386, అసిస్టెంట్ ఇంజినీర్ ముఖయ్యర్– 81211 96885, వీధి దీపాల నిర్వహణకు మున్సిపల్ ఇంజినీర్ యోగేశ్– 96426 25386, అసిస్టెంట్ ఇంజినీర్ సూర్య శ్రీనివాస్– 83286 61191, ఆస్తి పన్ను, తాగునీటి కుళాయిల చార్జీలు రెవెన్యూ అధికారి శ్రీనివాస్– 94408 29232, మహిళా సంఘాల నిర్వహణ, టీఎంసీ, అంగడి శ్రీనివాస్ –9440829232ను సంప్రదించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

రెంజల్, ఏప్రిల్ 2: రెంజల్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా కర్ణాటక చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెంజల్ ఎస్సైగా పని చేసిన సాయన్నను ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి బదిలీ చేస్తూ మార్చి 29న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన చంద్రమోహన్‌ను రెంజల్‌కు వచ్చారు.

సన్నబియ్యం పంపిణీ సాఫీగా జరిగేలా చూడాలి

- **కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, ఏప్రిల్ 2 : జిల్లాలో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న 21వ నంబర్ రేషన్ షాపును కలెక్టర్ బుధవారం సందర్శించి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. స్టాక్ రిజిస్టార్‌ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్‌పై ఆరా తీశారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సహాయ అధికారి రవిరాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీయాదవ్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ..

కంఠేశ్వర్, ఏప్రిల్ 2 : జిల్లాకేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలో ఉన్న 23, 31 రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సజావుగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఇప్పటివరకు సరఫరా చేసిన బియ్యం వివరాలను రేషన్‌డీలర్లను అడిగి తెలుసుకున్నారు.

బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

'విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం'

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి చేయడంతో పాటు అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నగర కమిటీ ప్రతినిధులు అన్నారు. అదనపు కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేసిన అనంతరం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం యత్నించడం సరికాదన్నారు. ఓ వైపు బీజేపీ పాలిత ప్రాంతాల్లో బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. వారు అధికారంలోని రాష్ట్రంలో అదే సంస్కృతిని పాటించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, సాయిబాబా, రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నగర కమిటీ నాయకులు

భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూములను వేలం వేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ టీయూ శాఖ ప్రతినిధులు అన్నారు. టీయూలో కన్వీనర్ సంజయ్, నాయకుడు చందుతో కలిసి బుధవారం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకుని, యూనివర్సిటీ భూములు విక్రయించేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో చత్రు, భార్గవ్, అజయ్, సుజాత, అమృత పాల్గొన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

- **వరుసగా మూడు రోజులు వెలుగుచూసిన 'కత్తి' ఘటనలు**
- **భయాందోళన చెందుతున్న ప్రజలు**
- **నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపణలు**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2 : జిల్లాకేంద్రంలో పాత నేరస్తులు, యువకులు కత్తులతో రోడ్లపై హల్‌చల్ చేస్తున్న ఘటనలు వరుసగా మూడురోజులుగా వెలుగుచూస్తున్నాయి. దీంతో స్థానికులు, ఆ ప్రాంతాల గుండా వెళ్తున్న ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. నగరంలో కత్తులతో దాడులు చేస్తున్న ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నా పోలీసులు వాటిని నియంత్రించడలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరుగకుండా పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు. బుధవారం సాయంత్రం ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తిపోట్ల ఘటన చోటు చేసుకున్నది. ఆరోటౌన్ ఎస్సై వెంకట్రాన్, స్థానికుల కథనం ప్రకారం.. కెనాల్‌కట్టకు చెందిన షేక్ గౌస్‌కు తెలిసిన యువతిని అదే ప్రాంతానికి చెందిన సోహెల్ వేధింపులకు పాల్పడ్డాడు. సదరు యువతి ఈ విషయాన్ని షేక్ గౌస్‌కు చెప్పడంతో పక్కింట్లో ఉండే సోహెల్‌ను ప్రశ్నించాడు. అనంతరం షేక్ గౌస్ కెనాల్ కట్ట ప్రాంతం నుంచి వెళ్తుండగా.. సోహెల్ తన ఇద్దరు మామలు పర్వేజ్, ఆరిఫ్‌ను అక్కడికి పిలిపించుకొని గొడవకు దిగాడు. షేక్‌గౌస్ కడుపు, ఛాతి భాగంలో ఆరిఫ్ కత్తితో పొడిచాడు. గాయాలపాలైన షేక్ గౌస్‌ను స్థానికులు జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీరి మధ్య ఉన్న పాతకక్షల కారణంగానే కత్తిపోట్ల ఘటనకు దారి తీసిందని సమాచారం.

'రాజీవ్ యువ వికాస్'ను సద్వినియోగం చేసుకోవాలి

- **బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో**

వర్ని, ఏప్రిల్ 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ గాంధీ యువ వికాసం పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. వర్ని మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఎంపీవోలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియపై సమీక్షించారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2 : జిల్లాకేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రవితేజ హాజరై మాట్లాడారు. ఆటిజం కలిగిన పిల్లలను ప్రోత్సహించి, వారిని తగిన శిక్షణ ఇవ్వడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంధ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ వికాస్, కార్యదర్శి సిద్ధయ్య, రాజేశ్వరి, బాబాగౌడ్, వీరేశం, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

కంఠేశ్వర్/ కోటగిరి/ బాల్కొండ, ఏప్రిల్ 2 : ఆనాటి రాచరిక వ్యవస్థలో దౌర్జన్యాలను ఎండగడుతూ, పన్నులు లేని వ్యవస్థను నెలకొల్పి సుపరిపాలన అందించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటగిరి మండల కేంద్రంలో గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని నెలకొల్పాలని గీత పనివాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ కోరారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

గిరిజన విద్యార్థి సంఘ నాయకుడి అరెస్ట్

పోలీస్ స్టేషన్‌లో ప్రవీణ్ నాయక్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 2: బోధన్ మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్ నాయక్‌ను బుధవారం రాత్రి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి వెళ్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రవీణ్‌నాయక్ మాట్లాడుతూ లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని చేస్తున్న తమ వినతిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

కార్పొరేషన్‌లో బర్త్ సెక్షన్ సర్వర్ డౌన్

కంఠేశ్వర్, ఏప్రిల్ 2 : మున్సిపల్ కార్పొరేషన్‌లో బర్త్ అండ్ డెత్ సెక్షన్లలో వారం రోజులుగా సర్వర్ పని చేయడం లేదు. ముఖ్యవిభాగాలైన బర్త్, డెత్ సెక్షన్లలో సర్వర్ పనిచేయకపోవడంతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయంపై డీవైఎస్‌వో దేవీదాస్‌ను వివరణ కోరగా.. వారం రోజులుగా సర్వర్ పనిచేయడం లేదని, పైనుంచే సర్వర్ ప్రాబ్లం ఉందని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని హైదరాబాద్ నుంచి సమాచారం ఉన్నట్లు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

ధర్పల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని ప్రాజెక్టు రామడుగు, కేశారం, సల్లగరిగె, దుబ్బాక, రేకులపల్లి తదితర గ్రామాల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పలు అభివృద్ధి పనులతో పాటు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్డు పనుల శిలాఫలకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- **అంబలి కేంద్రం, చలివేంద్రాలు ప్రారంభం-** కోటగిరి, ఏప్రిల్ 2 : మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, వ్యాపారవేత్త పోల విఠల్‌రావుగుప్తా ఆధ్వర్యంలో బుధవారం అంబలి కేంద్రం పాటు చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది వేసవిలో పోల రాఘవేంద్ర, దీప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.
- **సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలి-** వర్ని, ఏప్రిల్ 2 : సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్ అధికారి, ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని మ్యాట్రిక్స్ పాఠశాలలో సైబర్‌నేరాలు, బెట్టింగ్ బెట్టింగ్ యాప్‌ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **ఘనంగా 108 ఈఎంటీ దినోత్సవం -** ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2 : ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థలో పనిచేస్తున్న 108 సిబ్బంది బుధవారం ఈఎంటీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. 108లో పీఎం వసంత సమక్షంలో కేక్ కట్ చేశారు.

డిచ్‌పల్లి మండలకేంద్రంలోని నడ్పల్లి గ్రామపంచాయతీలో గ్రేడ్ –1 పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్మికశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి యోహాన్ హాజరై నిట్టు కిషన్‌రావు అందించిన సేవలను కొనియాడి, ఘనంగా సన్మానించారు.

– డిచ్‌పల్లి, ఏప్రిల్ 2

లక్ష్యాలను నిర్దేశించుకొని చదువుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్2: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని చదివినప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. పట్టణంలోని పెర్కిట్‌లో ఉన్న కేజీబీవీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు నిజామాబాద్ ఏసీపీ బస్వారెడ్డి, అడ్వకేట్ ఎం.కె.నరేందర్ శానిటరీ నాప్‌కిన్స్ వెండింగ్ మిషన్‌లను బుధవారం వితరణ చేశారు. పెర్కిట్ కేజీబీవీలో నిర్వహించిన జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు మిషన్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా, జీఈసీవో భాగ్యలక్ష్మి, ఎస్వోలు వినోద, గంగామణి, హెచ్ఎం వనజా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోస్లీ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా మండల సమైఖ్య అధ్యక్షురాలు ఉషారాణి

కోటగిరి/సిరికొండ/ పొతంగల్/రెంజల్/న వీపేట, ఏప్రిల్ 2 : కోటగిరి మండలం ఎత్తొండ విండో పరిధిలోని యాద్గార్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎత్తొండ విండో ఇన్‌చార్జి సీఈవో రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. సిరికొండ మండలంలోని కొండూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి ప్రారంభించారు. పొతంగల్ మండలంలోని కొడిచర్లలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. రెంజల్ సహకార సంఘం ఆధ్వర్యంలో రెంజల్, సాటాపూర్, తాడ్‌బిలోలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, రెంజల్ విండో చైర్మన్ మొహినుద్దీన్ ప్రారంభించారు. బోర్గాం, సాటాపూర్, అంబేద్కర్‌నగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఏపీఎం చిన్నయ్య తెలిపారు. నవీపేట మండలం నాగేపూర్, కోస్లీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణితో కలిసి ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్ ప్రారంభించారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

భవనం ప్రారంభం

మాక్లూర్, ఏప్రిల్ 2: నందిపేట్ మండలంలోని వన్నెల్ గ్రామంలో కోఆపరేటివ్ బ్యాంకు భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఖుద్వాన్‌పూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఖుద్వాన్‌పూర్ సహకార సంఘ చైర్మన్ కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం తనిఖీ

వివరాలు తెలుసుకుంటున్న న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 2: బోధన్ మండలంలోని జాడీ వృద్ధాశ్రమాన్ని బుధవారం న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సందర్శించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బోధన్‌కు చెందిన ప్రతినిధులు ఆశ్రమాన్ని సందర్శించి అందులో ఉన్న వృద్ధుల సంఖ్య, వారికి కల్పించిన వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు రమణ, పద్మాసింగ్, బోధన్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రతినిధి సుజాత ఉన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్2: గర్భిణులకు ప్రభుత్వ దవాఖానలో ఉన్న సదుపాయాలపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ దవాఖానలోనే కాన్పు చేయించుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట ఆరోగ్య కార్యకర్తలు జమున, రాజ గంగు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

చందూర్ పల్లె దవాఖానకు జాతీయస్థాయి గుర్తింపు

సిబ్బందిని అభినందిస్తున్న గ్రామస్తులు

చందూర్, ఏప్రిల్ 2 : మండలకేంద్రంలోని పల్లె దవాఖానకు జాతీయస్థాయి గుర్తింపు లభించినట్లు మెడికల్‌ఆఫీసర్ విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. కేంద్ర వైద్యబృందం జిల్లాలోని పలు పల్లె దవాఖానలను ఇటీవల పరిశీలించింది. చందూర్ పల్లెదవాఖానలో సేవలను గుర్తించి ఉత్తమ పల్లె దవాఖానగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. దవాఖాన వైద్య సిబ్బందిని మండలనాయకులు, గ్రామస్తులు అభినందించారు.

మాక్లూర్ మండలంలోని గుంజలి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ లక్ష్మణ సహిత ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను బుధవారం గ్రామం నుంచి ఆలయం వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించారు. అనంతరం 108 మంది ముత్తైదువులతో వెళ్లి కుంకుమ పూజలు నిర్వహించారు.

– మాక్లూర్, ఏప్రిల్ 2

బోధన్ ఏఎంసీ చైర్మన్‌గా చీలం శంకర్

బాధ్యతలను స్వీకరిస్తున్న చీలం శంకర్

బోధన్, ఏప్రిల్ 2: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాలూర మండలం హూన్సా గ్రామానికి చెందిన చీలం శంకర్ నియమితులయ్యారు. ఆయన బుధవారం ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. బోధన్ ఏఎంసీ చైర్మన్‌గా వ్యవహరించిన అంకుసంధ్యా దాము ఇటీవల ప్రభుత్వ ఉపాధ